BHARATH SAMACHAR DIGITAL

5, నవంబర్ 2026, గురువారం భారత్ సమాచార్

భూసారం పెంచే సహజ సాగు పద్ధతులపై రైతులకు అవగాహన



భారత్ సమాచార్, మెదక్ జిల్లా: వ్యవసాయంలో సాగు ఖర్చులు తగ్గించడంతో పాటు భూసారాన్ని పెంపొందించి, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తిని సాధించేందుకు రైతులు సహజ వ్యవసాయ పద్ధతులను ఆచరణలో పెట్టాలని వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించారు. జాతీయ సహజ వ్యవసాయ మిషన్ (NMNF) పథకంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రం (KVK), తునికిలో చిన్న చింతకుంట, జక్కపల్లి గ్రామాలకు చెందిన సహజ వ్యవసాయ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మెదక్ జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్ అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సహజ వ్యవసాయం ప్రాముఖ్యత, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్ర, సాగు పెట్టుబడులను తగ్గించుకునే మార్గాలపై రైతులకు వివరించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవడంతో పాటు భూసారాన్ని మెరుగుపరచుకోవచ్చని తెలిపారు. వ్యవసాయంలో ప్రకృతి అనుకూల పద్ధతులను అనుసరించడం వల్ల దీర్ఘకాలికంగా సాగుకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

జీవామృతం, బీజామృతం తయారీపై అవగాహన

సహజ వ్యవసాయంలో అనుసరించాల్సిన వివిధ పద్ధతులపై KVK శాస్త్రవేత్తలు రైతులకు వివరించారు. జీవామృతం, ఘన జీవామృతం, బీజామృతం తయారీ విధానం, వాటి వినియోగం గురించి అవగాహన కల్పించారు. పంటల్లో అంతర పంటల సాగు, జీవ వైవిధ్యాన్ని పెంపొందించే పద్ధతుల గురించి వివరించారు. ప్రకృతి సిద్ధమైన వనరులను వినియోగించుకుంటూ పంటల సాగు చేపట్టే విధానాలను రైతులకు తెలియజేశారు.

నేల ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ ముఖ్యం

రైతులు సహజ వ్యవసాయ పద్ధతులను కేవలం అవగాహనకే పరిమితం చేయకుండా తమ పొలాల్లో ఆచరణలో అమలు చేయాలని అధికారులు సూచించారు. రసాయనాల వినియోగాన్ని తగ్గిస్తూ నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తిని ప్రోత్సహించడం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం ద్వారా స్థిరమైన వ్యవసాయ అభివృద్ధికి బాటలు వేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో KVK శాస్త్రవేత్తలు, ADA సంధ్యారాణి, AO టెక్నికల్ యాదగిరి, చిన్న చింతకుంట, జక్కపల్లి గ్రామాలకు చెందిన సహజ వ్యవసాయ రైతులు, వ్యవసాయ విస్తరణ అధికారులు తేజస్విని, రాజశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.